
కథ

# మార్పుతెచ్చిన మాతృహృదయం

- ఆర్. మురళీకృష్ణ




**బడి చాలా సందడిగా ఉంది. ముందు పిరియడ్ ఇంగ్లీష్ మాస్టారు రాకపోవడం వల్ల ఆటల్లో మునిగిపోయిన పిల్లలు, బల్లలమీద గెంతుతూ, దూకుతూ అలుపెరగని తూనీగలని గుర్తుకు తెస్తున్నారు.**

చీకూ చింతా లేని వయస్సు. బరువూ, బాధ్యతల్లేవు. ఉన్న చింతల్లా బందిఖానాలాగ ఉన్న స్కూలు. అందులోని వార్డెన్లను మరపించె పంతుళ్ళు. గవర్నమెంటు వారి స్కూలు అవటం మూలాన శ్రద్దగా పాఠాలు చెప్పే పంతుళ్ళు తక్కువ. అందువల్ల శ్రద్ధగా చదివేవారూ తక్కువ. గాలికి తిరిగె పిల్లలే ఎక్కువ. మొత్తం స్కూలుకు ముగ్గురే టీచర్లు. ఒక టీచరు ఒక రోజు రాకపోతే సగం స్కూలుకు పాఠాలుండవు. పిల్లలకు పండగే.

నాలుగో తరగతి పిల్లలు చాలామంది "ఏడు రాళ్ళ ఆట"లో నిమగ్నమై ఉన్నారు. ఆడలాడె పిల్లలంతా రెండు జట్లుగా విడిపోయి ఒక జట్టు చదరంగా వున్న

ఏడురాళ్ళను వరుసగా, నిలువెత్తు పేర్చడానికి ప్రయత్నిస్తూంటే, యింకో జట్టు పిల్లలు మొదటి జట్టు పిల్లలను రబ్బరు బంతితో కొట్టడానికి ప్రయత్నం చేయాలి. మొదటి జట్టు బంతి తాకకుండా రాళ్ళను పేర్చాలి. ఒకవేళ మొదటి జట్టు బంతి తాకిడికి గురైతే, వాళ్ళు ఓడినట్లు అవతలి జట్టుకు ఒక పాయింట్.

అరుస్తూ, తోసుకుంటూ గెంతుతున్న పిల్లల్లో ఒకడికి దూరంగా ఒక చేత్తో పంచె కొసను, యింకో చేతితో పుస్తకం, బెత్తం చాకోపీసులు, అటెండెన్స్ రిజిష్టరుతో సహా జరీ కండవాను అదిమిపట్టి గంభీరంగా, హుందాగా వస్తూవున్న లెక్కల మాష్టారు దక్షిణామూర్తి శాస్త్రిగారిని చూడగానే కేరింతలు కొడుతున్న వాడల్లా బిగుసుకు పోయాడు. మరుక్షణంలో "రేయి, లెక్కల మాష్టారు ! లెక్కల మాష్టారూ !" అని అరవడం, కొన్ని క్షణాల్లో పిల్లలందరూ ఒక్కుమ్మడిగా తరగతి గదిలోకి దూరడం జరిగిపోయాయి. పులిని చూసి కొండెంగలు చెట్లపైకి పరుగెత్తినట్లు.

నిశ్శబ్దంగా ఉన్న క్లాసులోకి ప్రవేశించారు శాస్త్రిగారు. శాస్త్రిగారిది నిండైన విగ్రహం. గోష్పాదమంత శిఖతో, నొసటి మీద విబూది రేఖలతో, భ్రుకుటి మధ్య కుంకుమతో, గంభీరమైన ముఖ వర్చస్సుతో చూడగానే ఓ రకమైన భక్తి, భయం కలిగించే మూర్తిత్వం. ఆయన నవ్వుతూ ఉండగా పిల్లలు దాదాపుగా చూడలేదు. చాలా నిక్కచ్చి మనిషి. క్రమశిక్షణకు చాలా ప్రాముఖ్యం యిచ్చే వ్యక్తి. "దండం దశ గుణ భవేత్" అనే సూక్తిలో నమ్మకం కలిగి, అక్షరాలా పాటించే మనస్తత్వం. నియమాలు మన మంచికే అని నమ్మిన టీచర్.

శాస్త్రిగారిది బాగా పేరున్న శ్రోత్రీయమైన వంశం. తాత ముత్తాతలు వేదవేదాంగాలలో నిష్ణాతులు. శాస్త్రిగారు ఇంగ్లీషు చదువు చదివినప్పటికి, పూర్వపు కట్టుబాట్లను గౌరవించేవారు. సంస్కృతాంధ్రాలలో కొద్దో, గొప్పో పరిశ్రమ చేసినవారు. త్రికాల సంధ్యావందనం చేయనప్పటికి, నిష్ఠగా ప్రొద్దున, సాయంత్రం సంధ్యావందనం చేసేవారు. తండ్రి శివరామ దీక్షితుల మాట ఆయనకు వేదవాక్కు. తాతలు యిచ్చి పోయిన ఆస్తితోపాటు, అగ్రహారంలో లంకంత యిల్లు. జీవితం వడ్డించిన విస్తరిలా ఉన్నా ఒకే లోపం. ఆయనకు సంతానం లేదు.

క్లాసులో కుర్చీలో కూర్చునే ముందు తీక్షణంగా పిల్లల వైపు దృష్టి సారించారు. ఆగ్నేయాస్త్రం లాంటి ఆ చూపుల తీవ్రతకి తట్టుకోలేక పిల్లలు తలలు దించేశారు. అదిచూసి కలిగిన సంతృప్తిని బయటకు కనిపించనీక బెత్తంతో బల్లమీది చాక్‌పీస్ దుమ్ము లేచేలా రెండుసార్లు గట్టిగా బాదారు. అది ఆయన అలవాటు. పిచ్చి పిచ్చి వేషాలు వేసారో వీపు చీరేస్తా అనడానికి బదులు యిలా బెత్తంతో బల్లను బాదటం ఆయన పద్ధతి. అటెండెన్సు తీసుకున్న తరువాత లెక్కల పుస్తకం తెరిచారు. పాఠం మొదలుపెట్టేలోగా ఏదో గుర్తుకు వచ్చినట్లు ఆగి,

"ఏరా, అందరూ టెక్స్‌ట్ బుక్కులు తెచ్చారా", అని ఉరిమినట్లే అడిగారు.

"తెచ్చాం సార్" అని దాదాపుగా అరిచారు

"తేలేని వాళ్ళు, తేనివాళ్ళు నిలబడండి" తిరిగి అదేస్థాయిలో అన్నారు.

ముగ్గురు లేచి నిలబడ్డారు. అందరి కళ్ళూ వాళ్ళవైపు తిరిగాయి.

ముగ్గురిలో ఒకడివైపు చూస్తూ కనుబొమలు ఎగరవేశారు శాస్త్రిగారు.

"ఈరోజు తేవడం మరచిపోయాను సార్" చేతులు రెండూ కట్టుకుని జవాబిచ్చాడు వాడు.

"లంచ్ బాక్సు తెచ్చావా యీరోజు" శాస్త్రిగారి ప్రశ్న.

"తే ... తెచ్చానండి" నీళ్ళు నమిలాడా కుర్రాడు.

"తిండి జ్ఞాపకం ఉంది. పుస్తకం జ్ఞాపకం లేదురా గాడిదా" కోపంతో ఆయన కళ్ళు ఎరుపెక్కాయి.

లేత అరచేతుల మీద వాతలు తేలేటట్లు నాలుగు దెబ్బలు కొట్టారాయన. దెబ్బలు తట్టుకోలేక, ఏడుస్తున్న వాణ్ణి గోడకుర్చీ వేయవలసిందిగా చెప్పి, తమ దృష్టిని రెండో కుర్రాడి వైపు తిప్పారు.

"నువ్వెందుకు తేలేదురా"

"మ .. మ... మరచిపోయానండి" బెదిరిపోతూ జవాబిచ్చాడా కుర్రాడు.

ఆ సమాధానంతో ఆయన రుద్రుడే అయ్యాడు. చేతిమీద నాలుగు దెబ్బలతో పాటు చెవులు పిండి, వీపు మీద గుభీ, గుభీమని గుద్దులు గుద్ది, వాడిచేత గోడ

కుర్చీ వేయించి, మూడోవాడి వైపు చూసి, కొద్దిగా హేళనగా.

"ఇక తేలేని వాళ్ళు. పుస్తకం లేకుండా క్లాసుకి రావొద్దని చెప్పానుగా. ఎందుకొచ్చావురా క్లాసుకి" అనడిగారు.

"తె ... తెచ్చానండి" నసిగాడు, సన్నగా ఆ కుర్రాడు.

"తెచ్చావా, తెస్తే నిలబడ్డావేం" ఆవేశం మరింత ఎక్కువైంది శాస్త్రిగారికి.

"మరె ... మరేనండి" మాట్లాడలేకపోయాడు.

"ఏది, నీ పుస్తకం చూపించరా, పదిరోజుల నుంచి తేనివాడివి. యీ రోజు తెచ్చావంటె ఏదో విశేషమే" ఎగతాళిగా అన్నారు శాస్త్రిగారు.

వణుకుతున్న చేతులతో సంచిలోంచి పుస్తకాన్ని తీసి శాస్త్రిగారికి అందించాడా పిల్లవాడు.

చూడగానే తెలిసిపోయింది శాస్త్రిగారికి అది అచ్చు పుస్తకం కాదని. అంత కోపంలోనూ, నొసలు చిట్లించి ఆ పుస్తకాన్ని పరిశీలనగా చూశారు.

పచారి కొట్టులో సరుకులు కట్టిచ్చె, బూడిదరంగు కాగితపు సంచి ఉపయోగించి అట్టగా కుట్టిన పుస్తకం. అచ్చు పుస్తకం కన్నా ధృడంగానే ఉంది. కుతూహలంగా పుస్తకాన్ని తెరిచారు శాస్త్రిగారు. దళసరిగా ఉన్న తెల్లకాగితాల కట్ట. ఖరీదైన కాగితాలు కావు. సన్నగా, సాపుగా కాకుండా గరుకుగా ఉన్నా, తెల్ల కాగితాలే. వాటిపై ముత్యాల వంటి దస్తూరి. అర్థమైంది శాస్త్రిగారికి. ఎవరో మొత్తం అచ్చు పుస్తకాన్ని చేత్తో ఆ నాసిరకం కాగితాలపై రాశారు. అంతే, మరుక్షణంలో రెక్కలు వచ్చినట్లు ఆ పుస్తకం గాల్లో లేవటం, అదే క్షణంలో శాస్త్రిగారి బెత్తం ఆలేత శరీరంపై నాట్యమాడటం జరిగిపోయింది.

"గాడిదా, అచ్చుపుస్తకం తీసుకురారా అంటె, ఈ చచ్చుపుస్తకం తీసుకొస్తావా, అంతగా కొనలేనివాడివి యింట్లో కూర్చో స్కూలుకు రావడం దేనికి" తిట్లు, దెబ్బలు అడ్డూ అదుపు లేకుండా వడ్డించి, వాణ్ణి క్లాసునుంచి వెళ్ళగొట్టేదాకా శాంతించలేదాయన. దెబ్బల బాధకూ, జరిగిన అవమానానికి కృంగిపోయి, ఏడుపును దిగమింగుకుంటు, తలుపుదగ్గర పడ్డ ఆ పుస్తకాన్ని సంచిలో పెట్టుకుని, వాచిన అరచేతులను నోటితో ఊదుకుంటూ వెళ్ళిపోయాడా పసివాడు.

ఆ సంఘటన పుణ్యమాని రోజూ పడే దెబ్బలకన్నా రెండు దెబ్బలు ఎక్కువే పడ్డాయి కొందరు దురదృష్ట వంతులకు.

ఆరోజు సాయంత్రానికల్లా శాస్త్రిగారా సంఘటనను మరచిపోయారు. ఇంటికి రాగానే కాళ్ళు కడుక్కుని, వాలు కుర్చీలో కూర్చొని తమ తల్లిగారితో కుటుంబ విషయాలు ప్రస్తావించారు.

శారదాంబగారు డైబ్భైఏళ్ళ నిండు ముత్తైదువు. పరమ సాధువు. భర్త గీచిన గీటు దాటెరుగని యిల్లాలు. ఆవిడకి ఆరుగురు సంతానం. నలుగురు ఆడపిల్లలు. ఇద్దరు మగపిల్లలు. శాస్త్రిగారు అందరికంటె చిన్నవారు. ఈయన తప్ప అందరూ యిరుగు, పొరుగు ఊళ్ళలో ఉన్నవారు. మాటల మధ్యలో శాస్త్రిగారు "అవునూ, లక్ష్మిని ఓ నాలుగురోజులు రమ్మని వ్రాస్తానన్నావుగా వ్రాశావామ్మా" అనడిగారు. లక్ష్మి ఆయన పెద్దక్కగారు. "లేదురా అబ్బి వ్రాయలేదు. అదేమోగాని ఆ కార్డుముక్క వ్రాయాలంటె చచ్చే చావురా. ఆ నాలుగు ముక్కలు వ్రాద్దామంటె నాకు కనీసం రెండు రోజులు పడుతుంది" అందావిడ. శాస్త్రిగారికి నవ్వొచ్చింది. అభిమానంగా తల్లివైపు చూశారు.

ఇంతలో మెల్లిగా నడచుకుంటూ వచ్చారు శాస్త్రిగారి తండ్రిగారు. శివరామ దీక్షితులు. ఆయన్ని చూడగానె శాస్త్రిగారు వాలుకుర్చీలోంచి లేచి, తండ్రిని ఆ కుర్చీలో కూర్చుండబెట్టి తాను నేలపై కూర్చున్నారు.

"ఏరా, ఏమంటోంది మీ అమ్మ ?" అడిగారు దీక్షితులుగారు.

"ఏం లేదు నాన్నగారూ, అమ్మకు కార్డుముక్క వ్రాయటం కష్టమైపోయిందట" అన్నారు నవ్వుతూ.

దీక్షితులుగారు చిరునవ్వు నవ్వుతూ కొడుకును ఏదో అడగబోతూ ఆగిపోయారు.

శాస్త్రిగారి ముఖంలో నవ్వు మాయమైంది. ఏదో ఆలోచనతో ఆయన నొసలు ముడిపడింది. తనను కని, పెంచిన తల్లి, ఒక్కకార్డు ముక్క వ్రాయలేకపోయిందె, మధ్యాహ్నం తాను గిరాటేసిన లెక్కల పుస్తకాన్ని ఎవరు, ఎంత శ్రమకోర్చి వ్రాశారో ? అసలు లెక్కల పుస్తకంలో

ఎన్ని పేజీలున్నాయి ? తెలీదే, యిన్ని సంవత్సరాలుగా అదె లెక్కల పుస్తకాన్ని, ఎన్ని వందలమంది పిల్లలకు నేర్పించాడో, అయినాగాని అందులో ఎన్ని పేజీలున్నాయో తనకి తెలీదు.

అంతే, గభాలున లేచి తన గదివైపు వెళ్ళారు శాస్త్రిగారు. గదిలో బల్లపైనున్న లెక్కల పుస్తకాన్ని చేతిలో తీసుకుని చివరిపేజీ చూశారు. మూడువందల పన్నెండు పేజీలు. అన్నీ కలిపి ఈ పాటి పుస్తకాన్ని వ్రాయడానికి ఆ వ్యక్తి ఎంత కష్టపడుండాలి ? శాస్త్రిగారి చేతులు అప్రయత్నంగా మొదటి రెండు పేజీలు తిరగేశాయి. ధర ముప్ఫై అయిదు రూపాయలు. ఆయనలో చిత్రమైన అలజడి. తానెప్పుడు తిండికి కటకటలాడలేదు. పేదరికం గురించి చదవటం, వినటం తప్ప తానా కష్టాలను అనుభవించలేదు. కేవలం ముప్ఫై అయిదు రూపాయలు ఆదాచేయటం కోసం మూడువందల పేజీల పుస్తకాన్ని చేత్తో వ్రాశారే ? ఆ పేదరికం ఎంత దారుణంగా ఉండాలి ? వ్రాయించిన ఆ ప్రేమ, ఆ ఆత్మస్థయిర్యం, అరువు అడగని ఆత్మగౌరవం ఎంత బలీయమైనది ? ఎలాంటి పరిస్థితులలోనూ చెక్కు చెదరని ఆయన వ్యక్తిత్వం ప్రకంపనలకు లోనవసాగింది. తనమీద తనకున్న నమ్మకం తన సిద్ధాంతాల పట్ల తనకున్న ఆత్మవిశ్వాసం సడలసాగింది.

మౌనంగా ఉన్న కొడుకు ముఖంలో మారుతున్న రంగులు గమనించారు దీక్షితులుగారు. ఆయన దృష్టిలో కొడుకింకా పిల్లవాడే. దుందుడుకుగా ప్రవర్తించె కుర్రాడే. అయినంతవరకు తాను ఆయన్ను మార్చ[illegible]నికి ప్రయత్నించినవాడే. కాని కొన్ని విషయాలు కాలం, అనుభవం మీద తప్ప వేరే విధంగా నేర్చుకోలేము. అనునయంగా అడిగారాయన.

"ఏమైందిరా శాస్త్రీ ?"

కొంతసేపు మౌనం తరువాత మెల్లిగా ఉదయం స్కూలులో జరిగిన సంఘటనను వివరించారు శాస్త్రిగారు. అంతా విన్న దీక్షితులుగారి వదనంలో బాధారేఖలు పొడచూపాయి. ఆయన కొంతసేపు మిన్నకుండి, మెల్లిగా అడిగారు.

"ఏం చేద్దామనుకుంటున్నావు" ?

శాస్త్రిగారికి అర్థమైపోయింది తండ్రి తన ప్రవర్తనను ఆమోదించలేదని. తలవంచుకునే చెప్పారు తాను చేయదలచుకొన్నది. విన్న తరువాత కొద్దిగా సమాధానపడ్డట్లు కనిపించారు దీక్షితులుగారు. మెల్లిగా అన్నారు.

"శాస్త్రి క్రమశిక్షణ కన్నా మానవత్వం గొప్పదిరా. నియమాలు మనం, మనకోసం ఏర్పరచుకున్నవి. అంతేకాని అవే ముఖ్యంకావు. కాకూడదు. ఇప్పటికైనా తెలుసుకో" అంతకంటె ఎక్కువ మాట్లాడలేదాయన.

మరుసటిరోజు స్కూలు కెళ్ళగానే ఆ క్లాసు మానీటర్‌ను పిలిపించి ఆ కుర్రాడి పేరు, వివరాలు తెలుసుకొని ఆ కుర్రాణ్ణి తన గదికి పిలిపించుకున్నారు. మెల్లగా వచ్చి గదిగుమ్మం వద్ద నిలబడ్డాడు. వాణ్ణి పరిశీలనగా చూశారు శాస్త్రిగారు.

సన్నగా, పీలగా ఉన్నాడా కుర్రాడు. సరియైన పోషణ లేక శుష్కించిన శరీరం. ముఖం అమాయకంగా, కళగా ఉంది.

"నీపేరేంరా ?" మామూలుగానే అడిగారు.

"ర ... రఘుండి", తడబడుతూ చెప్పాడా పసివాడు.

"నిన్న ... నీవు చూపించిన లెక్కల పుస్తకం యిలాతే"

నెమ్మదిగా సంచి తెరచి, పుస్తకాన్ని శాస్త్రిగారికి అందించాడు.

విచిత్రమైన అనుభూతికి లోనయ్యారు శాస్త్రిగారు. మెల్లిగా పేజీలను తిరగేశారు. చక్కని దస్తూరి. ముత్యాలు వరుసగా పేర్చినట్లు. పుస్తకం చివరంటా సమంగా, సక్రమంగా, సాధారణంగా అన్ని పేజీలు వ్రాసినట్లయితే, చేతివ్రాత ముందున్నంత అందంగా తరువాతి పేజీల్లో ఉండదు. కాని యిక్కడ ... ఎంత కష్టపడ్డారో.

"ఎవర్రా యిది వ్రాసింది" మెల్లిగా అడిగారు

"మా అమ్మండి"

"ఊ ఎన్నిరోజులు పట్టింది ?"

"వారం రోజులండి"

"పొద్దున, సాయంత్రం వ్రాసేదా మీ అమ్మ"

"రాత్రికూడానండి"

చెళ్ళున కొట్టినట్లయింది. రాత్రికూడానా. దస్తూరిని పరిశీలించారాయన. పొందికైన వ్రాత.

దృఢమైన వ్యక్తిత్వం ప్రస్ఫుటంగా కనిపిస్తోంది ఆ చేతి వ్రాతలో.

"నీ నోటు బుక్కేదిరా"

అందించాడా కుర్రాడు. తను వాణ్ణి క్లాసుకు వారం రోజులపాటు రానివ్వకపోయినా, తాను నిన్నటి క్లాసులో చెప్పిన లెక్కలతో సహా అన్నీ ఉన్నాయి. బహుశా స్నేహితుల పుస్తకంలో చూసి వ్రాసుంటాడు.

"ఈరోజు నుంచి నువ్వు క్లాసుకి రా", మెల్లిగా అన్నారు శాస్త్రిగారు.

విస్తుపోయాడా కుర్రాడు. మెల్లిగా తలాడించాడు.

"కాని ఒక్క షరతు. ఈ సంవత్సరం పరీక్షల తరువాత నీవు ఈ పుస్తకాన్ని నాకివ్వాలి. ఇస్తావుకదూ", అభ్యర్థించినట్లడిగారు. ఈ కోరికతో పూర్తిగా అయోమయంలో పడ్డాడా కుర్రాడు. సరేనన్నట్లు తలాడించాడు.

"మరచిపోకే. నీ లెక్కల పుస్తకం నాకే. వెళ్ళు" అనగలిగారు.

**శాస్త్రిగారి ప్రవర్తన అర్థంగాక బుర్రగోక్కుంటు ఉండిపోయాడా కుర్రాడు ✪**

**('రంజని' కథల పోటీల్లో రెండవ బహుమతి పొందిన కథ)**

✤ ✤ ✤ ✤ ✤


# IMAGE HOSPITALS

Ameerpet, Hyderabad

*Super Speciality Health Care Centre*



ISO 9001 : 2000
Certified Hospital

## HIGHLIGHTS

✤ World Class Diagnostic facilities - open 24 Hours ✤ State-of-the art Operation Theatres & Well equipped Intensive Care Units ✤ Round-the-clock Emergency & Trauma care ✤ 24 Hours In-house Cardiologists Service Medical / Paramedical staff of global standards Super Speciality care from In-house Super speciality Doctors ✤ Well equipped ambulance fleet Free pick up of patients to be admitted (within Twin city limtes) ✤ Air conditioned deluxe, private and semi private rooms ✤ Ample parking space ✤ friendly ambiance to suit patients

RECOGNISED BY : CGHS, ESI, State Govt. Paramount, Heritage, TTK, Medseva, Unision, United, New India Assurance, Family Health plan & HDFC.

**24 Hours Emergency - Call : 23750000 / 55519999**